క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే దోహదం



గద్వాల అర్బన్: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి అన్నారు. కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బెల్ట్‌లను అందజేసి మాట్లాడారు. కరాటేతో ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ శ్రీనివాసులు, రామేశ్వరి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



శాంతినగర్: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన చేస్తున్న పలువురిని ఉత్తమ పురస్కారాలు వరించాయి. వడ్డేపల్లి మండలంలోని కొంకల జ్ఞాన స్ఫూర్తి పాఠశాల కరస్పాండెంట్ దేవేంద్రమ్మ, ఉపాధ్యాయులు మంజుల, జగదీష్ గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాల అర్బన్: వాల్మీకి బోయ సేవ సంఘం గద్వాల నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఆ సంఘం భవన్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులు తిమ్మప్ప, జగిలప్ప, ప్రధాన కార్యదర్శి శివరాజ్, కార్యదర్శులుగా రాజునాయుడు, శంకర్, రఘు, కోశాధికారి నర్సింహులు, సభ్యులుగా తిమ్మప్ప, మున్నెప్ప, వెంకట్రాములు, నాగరాజు, శేఖర్ నాయుడు, నర్సింహులు, రమేష్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా నిర్వహణ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీలను ఆ సంఘం నాయకులను పూలమాల, శాలువాతో సన్మానించారు.

ఉద్దెర ఇవ్వలేదని వ్యక్తులపై దాడి



కాలిన ముఖంతో వీరేష్

కేటీదొడ్డి: బజ్జీలు (మిర్చి బజ్జీ) ఉద్దెర అడిగితే ఇవ్వనందున హోటల్ యజమానిపై ఓ వ్యక్తి వేడి నూనె చల్లేందుకు యతించగా ఇద్దరికి గాయాలయిన ఘటన కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గువ్వలదిన్నె చెందిన బొజ్జన్నగౌడ్ గ్రామంలో చిన్నపాటి హోటల్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన వినోద్ బజ్జీలు ఉద్దెర ఇవ్వాలని హోటల్ యజమాని కోరగా.. ఆయన ఇవ్వను అని గట్టిగా చెప్పాడు. ఆగ్రహానికి గురైన వినోద్ పొయ్యి మీద గిన్నెలో మరుగుతున్న నూనెను యాజమాని బొజ్జన్న గౌడ్‌పై చల్లడంతో.. తలకు నడుముపై గాయాలయ్యాయి. హోటల్ యాజమాని వెనకాల కూర్చున్న కేటీదొడ్డి గ్రామానికి వీరేష్ ముఖంపై మరుగుతున్న నూనె పడి ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. గాయపడిని వారిని గద్వాల ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి రాయిచూర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వీరేష్ భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మిక ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్నాలో మున్సిపల్, పంచాయతీ కార్మికులు, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కార్మికులు, పరిశ్రమల్లో, రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సబ్‌సెంటర్ నిర్మాణం పూర్తయ్యేనా ?



అసంపూర్తిగా సబ్ సెంటర్ భవనం

- నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు
- 2021లో శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే
- నిలిచిపోయిన పనులు

అయిజ: ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు బస్తీ దవాఖానా, పల్లె దవాఖానాల పేరుతో ఆస్పత్రులను నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణం పూర్తి కాకపోవడంతో చిన్న చిన్న ఆస్పత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలందించాలనే లక్ష్యం నీరుగారిపోతుంది.

ఆరంభ శూరత్వం

మున్సిపాలిటీలోని 4వ వార్డుకు సంబంధించిన ఎస్సీ కాలనీలో పీహెచ్‌సీ సబ్ సెంటర్ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేసింది. 2021 ఏప్రిల్ 20వ తేదీ అప్పటి అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం శంకుస్థాపన చేశారు. ఆరంభ శూరత్వంలాగా ప్రారంభంలో పనులు వేగంగా జరిగినా అనంతరం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా మారింది. భవన నిర్మాణం పనులు పూర్తి కావస్తున్నా.. మరుగుదొడ్లు, సెంటర్ డోలర్లు, పెయింటింగ్ పనులు నిలిచిపోయాయి.

నిరుపయోగంగా సబ్ సెంటర్

నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనం నిరుపయోగంగా మారింది. ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు సబ్ సెంటర్‌లో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా, వైద్య సిబ్బంది పని చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో వైద్యాధికారులు సిబ్బందిని నియమించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది.

బిల్లులు చెల్లించలేదు

భవన నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. భవన నిర్మాణం పనులు ప్రారంభించినప్పటి నుంచి పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నా సరే ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి కూడా బిల్లు రాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

నిర్మాణం పనులు పూర్తిచేయాలి



సబ్ సెంటర్ నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు పట్టణం వెలుపల ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. సబ్ సెంటర్ పూర్తయితే ఇక్కడే చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సబ్ సెంటర్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయించాలి – ధర్మరాజు, కోట్ల వీధి, అయిజ

అధికారులు దృష్టిసారించాలి



సబ్ సెంటర్ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. నిర్మాణం పనులు పూర్తిచేసి వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తే పట్టణంలోని అనేక కాలనీల ప్రజలకు వెసులుబాటు కలుగుతుంది. సబ్ సెంటర్ పూర్తి కాకపోవడంతో పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి – అమరేష్, సంతబజార్ కాలనీ, అయిజ

ప్రభుత్వానికి నివేదిక పంపాం



పీహెచ్‌సీ సబ్ సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాన్ని పూర్తి చేయడం లేదు. బిల్డింగ్ పనులు పూర్తయినా ఇంకా కొన్ని పనులను పూర్తిచేయాల్సి ఉంది. ముఖ్యంగా డోర్లు, మరుగుదొడ్లు, పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తెస్తాం. – లక్ష్మన్న, పంచాయతీరాజ్ ఏఈ

పోరాటంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఆంజనేయులు

అయిజ: మున్సిపాలిటీలో అనేక సమస్యలు తిష్టవేశాయని, సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాటం చేద్దామని అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని అఖిలపక్ష కమిటీ కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పులికల్ రోడ్డు, వంతెన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, 30 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో రోగులకు వైద్య సదుపాయాలు అందడం లేదని, పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని అఖిల పక్ష కమిటీ అధ్యక్షుడు కోరారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, తాహెర్, మద్దిలేటి, కృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం



దుకాణదారుడికి బీజేపీ సభ్యత్వం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

రాజోళి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపి పార్టీదే హవా కొనసాగుతుందని.. ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. ఆదివారం రాజోళిలో మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక బీజేపి నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రధాని మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. పార్టీలో ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారని, రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపి హవా కొనసాగుతుందని అన్నారు. గ్రామాల్లో ప్రధాని నరేంద్ర మోడీ పథకాలపై, ఆయన చేస్తున్న అవినీతి రహిత పాలనపై ప్రజలు మంత్ర ముగ్ధులయ్యారని అన్నారు. గతంలో పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ, ప్రస్తుతం పాలిస్తున్న కాంగ్రెస్‌తో ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి పేదల కడుపు కొడుతుందని అన్నారు. పథకాల పేరుతో రైతులను, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా ముంచిన రేవంత్ సర్కారుకు కాలం చెల్లిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు అడివిస్వామి, శశికుమార్, ఈసీ అంజనేయులు, గోవిందురాజులు, భాస్కర్ రెడ్డి, చిన్నప్ప, నారాయణ చంద్రకాంత్, లక్ష్మణ్ గౌడ్, బసోది వీరన్న తదిదరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాంతినగర్ : వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామానికి చెందిన కుర్వ కిష్టన్న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు ఆదివారం కిష్టన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీచుపల్లి, లక్ష్మీనారాయణ, మాదన్న, వేణు, మహేష్ ఉన్నారు.

ఎర్రవల్లి: మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తక్కశీల తిప్పన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రఘాడ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు సురేందర్, రవి, రంజిత్, ఈదన్న, నర్సింహులు, హుస్సేన్, తదితరులు ఉన్నారు.

విగ్రహం ఏర్పాటుకు సహకరించండి

ఆత్మకూర్: పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు హాశం, రాజ్‌కిరణ్, యూసూఫ్, కురుమూర్తి కోరారు.

చెరువా.. సబ్‌స్టేషనా?

- చిన్న వర్షం కురిస్తే చాలు మూడు ఫీట్ల లోతు నీరు



నిల్వ నీటిలోనే లైన్ మార్చుతున్న ఆపరేటర్ (ఫైల్)



ఉప్పరిపల్లి లో వర్షపు నీటిలో విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లిలో ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు నీరు సబ్‌స్టేషన్‌లోకి చేరి కుంటను తలపిస్తుంది. గ్రామంలో నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా సబ్‌స్టేషన్‌లోకే వస్తుంది. మెండికుంట పాటుకాల్వ పక్కనే ఉండటంతో కుంటలో కొద్దిగా నీరు ఎక్కువ అయితే సబ్‌స్టేషన్ పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పరిపల్లి, సూరాయపల్లి, జగ్గాయపల్లి గ్రామాల్లోని 633 వ్యవసాయ బోర్ల కనెక్షన్లు, 890 గృహ అవసరాల మీటర్లు ఉన్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

అరచేతిలో సిబ్బంది ప్రాణాలు..

వర్షం కురిసిందంటే చాలు నీరు గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్‌లోకి చేరుతుండడంతో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. నడుముల వరకు నీటిలో భయపడుతూనే కర్రల సహాయంతో వెళ్లి లైన్ మార్చడం, ఆన్‌ఆఫ్ చేయడం చేస్తున్నారు. ఎప్పుడు విద్యుదాఘాతంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం ..

ఉప్పరిపల్లిలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు వస్తున్నాయని అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల సహకారంతో త్వరిత గతిన సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – కొండయ్య, ట్రాన్స్‌కో ఏఈ, ఖిల్లాఘనపురం

స్వచ్ఛ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి



కార్మికులకు ఆరోగ్య కిట్లును పంపిణీ చేస్తున్న చైర్మన్ కేశవ్

గద్వాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛత కార్మికుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు తమ కౌన్సిల్ కృషిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సుమారు 300 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్లు పంపిణీ చేశారు. వారం రోజులుగా జిల్లా కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు జయశ్రీ, శ్రీమన్నారాయణ, నాగరాజు, మహేష్, నాయకులు కోటేష్, ఇసాక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న ఐద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

గద్వాల అర్బన్: మహిళా హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఐద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఐద్వా సంఘం జిల్లా 2వ మహాసభలను నిర్వహించారు. ఈ సభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఐద్వా జెండాను ఆవిష్కరించారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, లక్ష్మీదేవి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, ఇప్పటికే మహిళలపై లైగింక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సినిమాలు, బెల్ట్‌షాపులు, డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలతో పాటు మానవ సంబంధాలు దెబ్బతినడమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద, నాయకురాలు పద్మ, జయలక్ష్మి, రాధ, పావని, శివమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో 26 అంగుళాల హృదయ పటాన్ని చిత్రీకరించి విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేశారు. మానవ శరీరంలో గుండెకు ఉన్న ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువగా ఒత్తిడికి దూరంగా ఉంటూ ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండాలని ఆయన సూచించారు.



హృదయం ఆకృతిలో నిల్చున్న విద్యార్థులు

'కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి'



కోయిల్‌దిన్నెలో సభ్యత్వం నమోదు చేసుకుంటున్న గ్రామస్థులు



ఉండవెల్లిలో..

ఉండవెల్లి: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఉపేంద్ర, గోపిరెడ్డి, హరీష్, మధుగోపాల్, రాజశేఖర్, శివ, మణికంఠ, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నె గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పార్టీ కార్యాలయానికి మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరెకటిక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయండి

వీపనగండ్ల: చర్మాలను శుభ్రం చేసే వృత్తిని ఎంపిక చేసుకుని దుర్భర జీవితాలను గడుపుతున్న ఆరెకటికలను ఆదుకునేందుకు ఆరెకటిక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని మండల ఆరెకటిక సంఘం నాయకులు శంకర్‌జీ, బాలాజీ, వెంకట్రావు, శ్రీనివాసులు, శివాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్ని రాష్ట్రాల్లో తమ కులస్తులు ఎస్సీ, బీసీ ఏ గ్రూపులో ఉన్నారని, తెలంగాణలో మాత్రం తమను బీసీ డీ గ్రూపులో చేర్చడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు అవసరమైన ఆర్థికసాయం అందించాలని వారు కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

పాన్‌గల్: అంబులెన్స్‌లోనే గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గర్భిణి శిరీషకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో గర్భిణిని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. అప్రమత్తమైన సిబ్బంది అంబులెన్స్‌లో ప్రసవం చేయగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చిందని ఈఎంటీ శశికుమార్, పైలెట్ మహేష్ తెలిపారు. తల్లి, బిడ్డను జిల్లా ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పినట్లు వారు పేర్కొన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.

ఎర్రగట్టు మైసమ్మకు పూజలు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు సమీపంలో ఉన్న ఎర్రగట్టు మైసమ్మను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. అజ్జకొలు, తిరుమలాయపల్లి, రామన్‌పాడు, మదనాపురం తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ వారు తాగునీటి వసతి, విడిది సత్రాలు ఏర్పాటు చేశారు.

చిరుత సంచారం

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లి సమీపంలోని బోడగుట్ట దగ్గర ఆదివారం ఉదయం, అప్పారెడ్డిపల్లి శివారులో రాత్రి 8గంటల సమయంలో చిరుత పులి సంచరించడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఇదే గుట్టపై రెండు చిరుత పులులు కనిపించాయి. కొన్ని రోజులకు కర్నెతండా వైపు ఉన్న అడవుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. ఆదివారం మరోసారి గుట్టపై కనిపించడంతో గుట్ట పక్కన బీటీ రోడ్డు వెళ్లడానికి ప్రయాణికులు భయపడుతున్నారు. గుట్ట చుట్టు మల్కిమియాన్‌పల్లి, వసురాంతండా, సూర్యతండా, దేవబండతండా, హీర్లతండా, నేలబండ తండా, అల్లమాయపల్లి తదితర గ్రామాలున్నాయి. చిరుత సంచరిస్తున్నట్లు తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చిరుతను పట్టుకుని అడవులకు తీసుకెళ్లాలని కోరుతున్నారు.

సింహగర్జన సభను జయప్రదం చేయండి

వనపర్తి రూరల్: జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిట్యాల, కడుకుంట్ల గ్రామస్థాయి మాల మహానాడు నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. చిట్యాల గ్రామ అధ్యక్షుడిగా చిన్న దాసు, ప్రధాన కార్యదర్శిగా బర్కం రమేష్, ఉపాధ్యక్షులు పెద్దదాసు, శాంతయ్య, కార్యదర్శులుగా శేఖర్, ఆంజనేయులు, కడుకుంట్ల గ్రామ అధ్యక్షుడిగా జెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి దాసరి కురుమూర్తి, ఉపాధ్యక్షులుగా బిజ్జ శేఖర్, దాసరి సురేందర్, కార్యదర్శులు దాసరి వెంకటేష్, జెట్టి నరసింహతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.